# ఒకే ఒక్క పొరపాటు

– ఆనందరావ్ పట్నాయక్.

వేసవి సెలవులకి మేమంతా హైద్రాబాద్ బయల్దేరాం. మేం అంటే– నేను, మా అమ్మ, నాన్న మొత్తం ముగ్గురం. అయితే రాయగడలోని మా ఇంటి రక్షణ బాధ్యత వహిస్తూ ఎవరు పడుకుంటారనేది ప్రశ్న. ఈ రోజుల్లో ఆఫీసులో ప్యూనులు బడాబాబుల కన్నా గొప్పోళ్లు. అందువలన మా నాన్నగారు చేతులెత్తేశారు. ఇకపోతే అమ్మ ఈ విషయంలో సహకరించింది. అదే ఊరిలో ఇంజనీరింగ్ చదువుతున్న వాళ్ల అన్నయ్య గారి అబ్బాయి సతీష్‌ని పిలిచి, ఆ పదిరోజులు మా ఇంట్లో పడుకోమంది. సతీష్ సరేనన్నాడు.

హైద్రాబాద్‌లో పదిరోజులు పదిగంటల్లా గడిచిపోయాయి. ఒకరోజు టాంక్‌బండ్, లుంబినీ పార్కు, నెక్లెస్ రోడ్డు చూశాం. హుస్సేన్‌సాగర్ తీరాన వరుసగా కాంస్య విగ్రహాలు. అందులో నన్ను అమితంగా ఆకర్షించిన విగ్రహం– పొట్టిశ్రీరాములు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన త్యాగధనుడు. ఆయన పేరున ఒక విశ్వవిద్యాలయం నెలకొల్పడం నాకు మరీ సంతోషాన్ని కలుగజేసింది.

మరో రోజు గండిపేట వెళ్లి వచ్చాం. ఆ తర్వాత చార్మినార్. అక్కడి షాపింగ్‌లో ఎలా సమయం గడిచిందో తెలియలేదు. సినిమాలు, షికార్లతో మిగతా రోజులలా గడిచిపోయాయి. ఇవన్నీ ఒక ఎత్తయితే, రామోజీ ఫిలింసిటీ మరో ఎత్తు. ఉదయం తొమ్మిది గంటలకు బయలుదేరిన వాళ్లం... స్టూడియోలో అడుగుపెట్టిన ఆ ఎనిమిది గంటలు ఎలా గడిచిపోయాయో తెలియలేదు. టీ గార్డెన్స్‌లా ఉండే తోటలు, పచ్చని లాన్, ఫౌంటెన్స్, చూస్తుంటే ప్రకృతి ఒళ్లో ఉన్నట్లనిపించింది. ఆ ఫిలింసిటీలోని క్యాబ్స్ ఎక్కి గైడ్ చెబుతున్న విశేషాలు పారవశ్యంతో విన్నాం.

'ఇక్కడేనండీ! గోవిందా ఒక అడ్వర్టయిజ్‌మెంటు సినిమా షూటింగు జరుపుకున్నాడు. ఆయనకి ఈ ప్రదేశం అంటే ఎంతో ఇష్టం...' అని గైడ్ మహాశయుడు వర్ణిస్తూ చెప్తే, నిజంగా గోవిందాని చూసినట్లనిపించింది. ఇకపోతే ఎయిర్‌పోర్టు, జైలు, హాస్పిటల్, పోష్ కాలనీ చూపెడుతూ– ఇక్కడ ఫలానా షూటింగ్ అయింది, ఫలానా సినిమా చిత్రీకరణ అయిందని చెపుతోంటే మాకు నిజమైన షూటింగ్ చూడాలన్న ఆసక్తి పుట్టింది. ఒకచోట జనం గుమిగూడి ఉన్నారు. మా క్యాబ్ ఆగింది.


'అందరూ నాతో రండి. ఐదు నిముషాల్లో మనం వెళ్లిపోవాల్సి వుంటుంది' అని చెప్పి గైడ్ ముందుకు దారితీశాడు.

అక్కడ గ్రూప్ డ్యాన్స్ రిహార్సల్స్ అవుతోంది. సినిమా తార 'రాశి' స్టెప్పులు వేస్తోంది. చూడముచ్చట వేసింది. కానీ, కాలానికి మహా విలువనిచ్చే మా హడావిడి గైడ్,

'బాబ్బాబు! మీరలా కాలయాపన చేస్తే నా ఉద్యోగం ఊడుద్ది, ఉరుకుండ్రి' అని జబర్దస్తీగా అందర్నీ క్యాబ్‌లోకి ఎక్కించి తీసుకెళ్లాడు.

సెంట్రల్ హాలు చేరుకున్నాం. మణిపురి నుండి వచ్చిన డ్యాన్సర్స్ అద్భుతంగా నాట్యం చేసి మమ్మల్ని ముగ్ధుల్ని చేశారు. క్యాసెట్‌లోని సంగీతానికి అనుగుణంగా రెండు జంటలు హిందీ పాటలకు స్టెప్స్ వేసి షారుఖ్‌ఖాన్, మాధురీదీక్షిత్‌లను మరిపించారు.

ఐదు కావొస్తుందనగా, ఆ కళాకారులందరూ మమ్మల్ని వీడ్కోలు చెప్పారు. పుస్తకాల్లో, పత్రికల్లో చదవడమే గానీ ఆ రోజు అక్కడి కార్యక్రమం ఇంత బాగుందంటే నాకు నమ్మశక్యం కాలేదు. ఆరు వందల ఎకరాల్లో, ఆరు వందల కోట్లతో ఒక ఆంధ్రుడు అద్వితీయమైన ప్రతిభతో ఒక అద్భుత లోకాన్ని నిర్మించాడు. విదేశాల నుండి



టూరిస్టులు ఫిలింసిటీని సందర్శించి 'నభూతో నభవిష్యతి' అంటుంటే, అప్పుడు నాకు అక్కడి మహత్తు అర్థమైంది ఆసియా ఖండంలోనే చెప్పుకోదగ్గ అద్భుత నిర్మాణం ఈ రామోజీ ఫిలింసిటీ. నిశ్శబ్దంగా ఆ విశ్వకర్మకి నా జోహార్లు అర్పించి, తిరుగు ప్రయాణం పట్టాం. మా అక్కా బావ మాకు బట్టలు పెట్టారు. పోచంపల్లి చీర ఇంత హుందాగా ఉంటుందంటే నమ్మశక్యం కాదు. దాన్ని మగ్గం మీద నేసిన నేత పనివారి వేళ్లలో ఏ గారడీ ఉందో గానీ ఒక సినిమా పాట గుర్తొచ్చింది.

'గాలిలోన తేలిపోయే చీరగట్టిన చిన్నదానా!

జిలుగు వెలుగుల చీర శిల్పం ఎలా వచ్చెనో చెప్పగలవా?

బడుగు పాతల బరువూ బ్రతుకుల నేతగాళ్లే నేసినారు

చాకిరొకరిది, సౌఖ్యమొకరిది సాగదింక...'

. . . . .

గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుతూ ప్లాట్‌ఫామ్ మీదున్న జనాన్ని విడిచిపెట్టేసింది. కానీ దూరాన ఉన్న నౌబత్ పహాడ్, దానిపైన వున్న వెంకటేశ్వర మందిరం, వెలుగుతున్న దీపాలు చాలాసేపు మమ్మల్ని అంటిపెట్టుకునే ఉన్నాయి. దారిలో డిన్నరు టైంకి మా అమ్మ క్యారియరు విప్పి మాకు వడ్డించింది. పులిహోర తిని, పచ్చావకాయ నంజుకుంటుంటే కళ్లలో నీళ్లు తిరిగాయి. నా అవస్థని గమనిస్తున్న నాన్నగారు ఒక స్వీటు ఇచ్చారు. గుంటూరు కారం నషాళానికి ఎక్కిందేమో, గభాలున ఒక ముక్క కొరికి ఆబగా తిన్నాను. అంతే స్పీడుతో పడింది తేనెలాంటి పాకం.

'అమ్మా! నెమ్మదిగా తిను. ఇది పుల్లారెడ్డి షాపులోని కోవా పూరీ' అన్నారు నాన్నగారు.

'అవునూ! పుల్లారెడ్డి అంటారేమిటి?' అన్నాను ఆసక్తిగా.

ఒక సామాన్యుడు ఇంతలో వటుడింతైనట్లు ఎదిగి నాంపల్లిలో పెట్టిన స్వీటు స్టాల్ గురించి వర్ణించి చెప్పారు. అక్కడి స్వీట్స్ అమెరికా, ఇంగ్లాండు, ఆస్ట్రేలియా లాంటి దేశాలు వెళ్తాయట. శుచికి, రుచికి మారుపేరు పుల్లారెడ్డి స్వీట్స్!' అని ముగించారు నాన్నగారు. ఆ తర్వాత ముక్తాయింపుగా వక్కపొడి వేసుకున్నారు. నేను పొట్లం మీదున్న పేరు చదివాను–

'త్రివేణి వక్కపొడి'

నా నుండి ఇంకో ప్రశ్న రాకముందే నాన్నగారు త్రివేణి పక్కపొడి విశిష్టతను చెప్పారు-

'విజయవాడలోని ఒక ఆంధ్రుడు ఎలా చిన్న కుటీర పరిశ్రమని ఆరంభించి కోట్లమీద వ్యాపారం చేశాడు... ఆ ఇద్దరు తెలుగువాళ్ల కథనాన్ని ఏడు కోట్ల ఆంధ్రావనికి తెలియజెప్పిన స్వాతి పత్రికకి కూడా హేట్స్ ఆఫ్!' అని చెప్పారు.

ట్రెయిన్ నడుస్తోంది. టెలిగ్రాఫ్ స్తంభాలు, చెట్లు, పుట్టలు వెనక్కు పరుగెడుతున్నాయి. చల్లని గాలి చక్కిలిగింతలు పెడుతోంది. గోదావరి ట్రెయిన్‌లో పయనించడం మంచి అనుభూతి.

'ఒరేయ్ కన్నా! వీటి గురించి చెప్పుకో!' అని అరడజను గోళీల్లాంటివి ఇచ్చారు. అవి నోట్లో వేసుకుని చప్పరించి-

'ద్రాక్ష.. ద్రాక్షపళ్లు...' అన్నాను ఉత్సాహంగా.

'ఉత్త ద్రాక్ష కాదురా! 'అనాబ్‌షాహి' అంటారు వీటిని. అక్కినేని గారి గ్రేప్ యార్డులో ఇలాంటివే పండిస్తారురా తండ్రీ!' అన్నారు పితాశ్రీ.

'అక్కినేని అంటే నాగార్జున కదూ!' అన్నాను తమాషాగా.

'నాగార్జునకి నాన్నగారు- అక్కినేని నాగేశ్వరరావు! ఇప్పటికీ, ఈ డెబ్బయి ఏడేళ్ల వయస్సులో కుర్రాడిలా, చలాకీగా చెంగుచెంగున గెంతుతూ డ్యాన్సులు చేస్తున్న డా.. అక్కినేని, కళాప్రపూర్ణ... మా ఫేవరెట్ హీరో...' అన్నారు నాన్నగారు తాదాత్మ్యంతో.

. . . . .

భళ్లున తెల్లవారింది. చెంపలు రాసుకుంటూ కొంటె గాలి ఊసులాడుతుంటుంటే, విశాఖ వచ్చిందన్నమాట! టీ, కాఫీలు అమ్మేవాళ్ల కేకలతో కలకల్లాడుతోంది ప్లాట్‌ఫామ్. మేమంతా దిగాం.

'మామిడి తాండ్ర... అంటుమామిడి తాండ్ర...' అంటూ ఒకడు బండితోస్తూ మా ముందునుండి వెళ్తున్నాడు.

'నాన్నారూ! అదేమిటి?'

పది రూపాయలిచ్చి ఒక ప్యాకెట్ తీసుకుని నాకొక ముక్క ఇచ్చారు. తింటుంటే భలేగా వుంది. చాక్లెట్ కన్నా రుచిగా ఉంది. మరోసారి అడిగాను- అదేమిటని.

'అలమండ తాండ్రరా నాన్నా! అది తిన్న అమరులవుదురు ఆంధ్రులు...' సినీమాటిక్‌గా చెప్పాడు డాడీ.

. . . . .

మరో పాసింజరు ట్రెయిను ఎక్కాం. సింహాచలం స్టేషనులో ఆగింది. మా అమ్మ ఎర్రని లక్కపిడతలు, నల్లని సవరాలు కొంటుంటే నాన్న ముసిముసిగా నవ్వుకున్నారు. అమ్మ బుంగమూతి నాకు భలే అన్పించింది. విజయనగరం వచ్చేవరకు తాటిముంజలు, సువర్ణ రేఖలు, పనస తొనలు... తింటూ సంపెంగ పూల సౌరభానికి మత్తెక్కిపోయాం. పుస్తకాలమ్మే అబ్బి దగ్గర పుస్తకాలు కొనాలనిపించింది. కారణం- అతనికి ఒకే ఒక్క చెయ్యి ఉండడం. మెడన ట్రే వేలాడదీసి రన్నింగ్ ట్రెయినులో పెట్టె పెట్టెకు మారుతున్న ఆ అపర అభిమన్యుడికి మనసులోనే సలాం చేశాను.

'నడిరేయి ఏ జాములో...' పాట దగ్గర దగ్గరగా వస్తోంది. రెండు కళ్లు లేని కబోది ఘంటసాలని అనుకరించి పాడుతుంటే, నిజానికి ఏడుకొండలవాడే ఉండి ఉండుంటే ఈ అంధుడికి జరిగిన అన్యాయానికి నిలదీయాలన్పించింది. అటువంటిది కాళ్లు, చేతులు, కళ్లుండీ ఇతరుల మీద ఆధారపడే వాళ్లని తుపాకీతో తూట్లు పొడవాలనిపించింది. సిక్కోలు వచ్చేసిందేంటి సెప్మా! నాలో ఈ విప్లవ భావాలేమిటి?

ఆలోచనలకు స్వస్తి చెప్పి చూశాను. దూరాన కొండల నడుమ మా ఊరు. చిన్నప్పుడు గిరివ్రాజపురమనే ఊరు గురించి చదువుకున్నాం. అలాంటిది మా రాయగడ. చుట్టూ కొండలు. పచ్చని అడవులు. అమాయక ఆదివాసులు ఉండే ఆ వూరంటే నాకు ప్రాణం. అక్కడి చింతపండు, గుగ్గిళం, తుమ్మ జిగురు, అడ్డాకులు ఆంధ్రాకి తరలి వెళ్తాయి. మరో గొప్ప సంగతేమంటే- ఇక్కడ పుట్టిన చీపుర్లు ఆంధ్రా అంతటా నర్తనం చేస్తాయి హోటల్లోని దోశె పెనాల మీద.

ఇంటికి చేరాం.

. . . . .

నాలుగైదు రోజులు గడిచాయి. నాన్నగారి పార్కరు పెన్, నా పైట పిన్ను, అమ్మ వెండి దీపం సెమ్మెలు కన్పడడం లేదు. సతీష్ మీద అనుమానం అరక్షణం మెదిలి మాయమైంది. ఛ... ఛ...

పదిరోజులు గూర్ఖాలాగా ఇల్లు కాపలా కాసిన మా మేనమామ కొడుక్కి మేమిచ్చే కితాబు ఇదా! అక్కడితో ఆ విషయం మరిచిపోయాం.

ఒకరోజు గుడికి వెళ్లాం. మెట్ల దగ్గర చెప్పులు విడిచిపెట్టి వెళ్లబోతూ నా దృష్టి ఒక జత చెప్పుల మీద పడ్డాయి. అవి హైద్రాబాద్‌లో చార్మినార్ మార్కెట్‌లో కొన్నవి. లేటెస్టుగా వచ్చాయని షాపతను చెప్పి ఐదు వందలు అందుకున్నాడు. కానీ అవి నావేనన్న గ్యారంటీ ఏమిటి? ఎవరైనా అటువంటివి కొనుక్కోవచ్చుగా. అన్యమనస్కంగా అమ్మవారి దర్శనం ముగించుకుని వచ్చేసరికి పరికిణీ, పావడా వేసుకున్న పదహారేళ్లమ్మాయి ఆ చెప్పులు తొడుక్కుంటోంది. నాలో ఏ మూలో కాస్తంత అనుమానం... నిజానికి ఆ అమ్మాయి స్టేటసుకి తగిన చెప్పులు కావవి.

ఆత్రుత అణచుకోలేక- 'అమ్మాయ్! ఈ చెప్పులు ఎక్కడ కొన్నావు?' అని అడిగాను.

'ఏం! నీకెందుకు?' అని గీరగా సమాధానం.

'అహాఁ! అది కాదు. ఎంతలో ఉంటాయని?' అని వస్తున్న కోపాన్ని అదిమిపట్టి అడిగాను.

'వంద రూపాయలు. మా అన్నయ్యకి రాఖీ కడితే నాకు తెచ్చిచ్చిండు' అందామె లేడిలా చెంగున గెంతుకుంటూ.

బిరబిరా ఇంటికొచ్చి చూస్తే, షూ స్టాండులో నా చెప్పులు లేవు. భోరున ఏడ్చాను. అమ్మానాన్నకి కూడా జాలేసింది. ఇంట్లో వున్న ఒక్కొక్క వస్తువు మాయమవుతున్నాయి. మా ఇంట్లో పనిమనిషి ఉన్నా పెరటిలో అంట్లు తోమి అలానే వెళ్లిపోతుంది. పొరబాటున కూడా ఇంట్లోకి రాదు. అన్నయ్య మద్రాసులో సి.ఏ. చదువుతున్నాడు. వాడు లేకపోతే వాడి స్నేహితులెవ్వరూ రారు.

చిల్లర మల్లరకి కాళ్లొస్తున్నాయి. అల్మరాలో వున్న సొమ్ము, ఆభరణాలు పదిలంగా ఉంటున్నాయి. దొంగగాని పడితే- టి.వి., డెక్, ట్రాన్సిస్టర్, టేపురికార్డరు కూడా ఎత్తుకుపోవాలి. మరి ఈ మిస్టరీ ఏమిటి? ఎప్పటివరకు ఈ దోపిడీ?

. . . . .

మా ఇంట్లో సర్వసభ్య సమావేశం జరిగింది. నాన్నగారి అధ్యక్షతన జరిగిన ఈ సభకు నేను ముఖ్య వక్తను. అమ్మ ముఖ్య అతిథి. కూలంకషంగా చర్చించి మేమంతా ఒక నిర్ణయానికి వచ్చాం.

పోలీసులకు చెప్పి లాభం లేదు. ప్రైవేటు డిటెక్టివ్ ఆ ప్రాంతాల్లో లేడు. ఇకపోతే నేనే గూఢచారిణిగా వ్యవహరించాలి. క్రయిం పుస్తకాలు చదివి, చదివి నేనే జేమ్స్‌బాండ్ అవ్వాలన్న ఉత్సాహం ఉరకలు వేస్తోంది. అధ్యక్షులవారు, నేను ఒక వ్యూహం రచించాం. మేం అల్లిన సాలెగూడులోకి రాబోతోంది ఈగ.

. . . . .

ఒకరోజు ఉదయం ఫట్‌ఫట్‌మని చప్పుడు చేసుకుంటూ ఆటో వచ్చి నిలబడింది. మేం ముగ్గురం ఇంటికి తాళంవేసి ఇరుగుపొరుగు, ఎదురింటి వాళ్లకు మరోసారి ఊరెళ్తున్నట్లు చెప్పాం. అప్పటికే రెండ్రోజులయి మా ప్రోగ్రాం దూరదర్శన్‌లో టెలికాస్ట్ చేసినట్లు ఊరూవాడా ప్రచారం చేశాం. ఆటో సందు తిరిగి ఆగింది. నేను ఆటో దిగి, ఇంటి వెనుక పిట్టగోడ ఎక్కి పెరట్లో దిగాను. చిన్న నిచ్చెన ఈ యజ్ఞంలో పాలుపంచుకుంది. గుమ్మం తోశాను. చప్పుడు కాకుండా తెరుచుకుంది. నేను లోనికి రావడం, తలుపులు మూసుకోవడం... అంతా హిచ్‌కాక్ పిక్చరులా జరిగిపోయింది.

గంట... రెండు గంటలు... మూడు గంటలు గడిచాయి. బెడ్‌రూం నుండి హాలులోకి తిరిగి అలసిపోయాను. కాలక్షేపానికి టి.వి. వున్నా వెయ్యకూడదు. ఉక్క పెడుతున్నా ఎయిర్‌కూలర్ ఆన్ చెయ్యకూడదు. ఒంటిగంటయింది. ఆకలి వేస్తే కిచెన్‌లోకి వెళ్లి అన్నం పెట్టుకుని తిన్నాను. మధ్యాహ్నం రెండయింది. సూర్యభగవానుడు ఇంట్లో ఇద్దరి పెళ్లాలతో జగడమాడి వచ్చేసినట్లుంది. నిప్పులు చెరుగుతున్నాడు. ఎక్కడా కాకి కన్పడ్డం లేదు. భోజనం అయిందేమో కళ్లు కూరుకుపోతున్నాయి. ఇలా అయితే ఫత్తేదారు డ్యూటీ చేసేదెట్లా! ఫ్రిజ్ వాటర్‌తో మొహం కడుక్కున్నాను.

'బీ అలర్ట్... అలర్ట్...' సెల్ఫ్ హిప్నొటైజ్ చేసుకున్నాను. ప్రఖ్యాత మెజీషియన్ బి.వి.పట్టాభిరాం గారిని మనస్సులో

స్మరించుకున్నాను. హుషారు నాలో నరనరాన ప్రాకిపోయింది.

బయట గేటు తీసిన చప్పుడు. ఆ తర్వాత గ్రిల్ తలుపు తాళం తీస్తున్న చప్పుడు. అయితే అమ్మా, నాన్న వచ్చేసినట్లేనా! ఇంత ఇంట్లో ఒంటరిగా అమ్మాయి పదిలంగా ఉందో, లేదో, బిక్కచచ్చిపోయిందని మావాళ్లు వచ్చేశారా! నో... ఎంతమాత్రం వీల్లేదు. డాడీకి నా మీద కొండంత నమ్మకం!

ఒకవేళ మా వాళ్లే వస్తే ఆటో శబ్దం వినపడాలి కదా! రాబోతున్నది అస్మదీయులు కారు. నాలో రోమాలు నిక్కబొడుచుకున్నాయి. సిక్స్త్ సెన్స్ చెప్తోంది. బెడ్‌రూంలో తలుపు చాటున దాక్కున్నాను. హాలుకున్న డోర్ తాళం తీసిన చప్పుడు. లోనికి వస్తున్న వ్యక్తి అపరిచితుడు కాదు. ఫ్రిజ్ తలుపు తీసిన చప్పుడు. బహుశా కోక్ తాగివుంటాడు. బ్రేవ్‌మని తేన్చాడు. ఆపిల్‌పండు పరపరా నమిలిన చప్పుడు. గోడకున్న షెల్ఫ్‌లోంచి వక్కపొడి తీసి నములుతున్నాడు. పూజగదిలోకి వెళ్లి వెతుకుతున్న చప్పుడు...

నా చెవులు అతి సునిశితంగా పనిచేస్తున్నాయి. సన్నగా కూనిరాగాలు విన్పించాయి. మాస్టరు బెడ్‌రూం సర్వే చేసి వచ్చినట్లుంది. తర్వాత నా రూంలోకి రావాలి. ఇంకా రాడేమిటి? అప్పుడు విన్పించిన చప్పుడుకి నవ్వు రాబోతోంది. దొంగగారు లఘుశంక తీర్చుకుంటున్నారు. ఆ కార్యక్రమం ముగియడం, నా గదిలోకి జొరబడ్డం, వాడిని వెనుక నుండి తోసి, నేను బయటకు వచ్చి తలుపు గడియ పెట్టేయడం, నాన్నగారికి ఫోను చెయ్యడం, పోలీసులు రావడం జరిగిపోయాయి. దొంగ మరెవరో కాదు- నాయక్. నాయక్ గురించి ఫ్లాష్‌బ్యాక్ చెప్పాలి.

.....

ఇల్లు కట్టిన తర్వాత నాన్నగారికి బాగా ఖర్చయింది. ఆ టౌనులో అప్పుడే విస్తరిస్తున్న అల్యూమినా ప్రాజెక్టుకి గెస్ట్‌హౌస్ అవసరం పడింది. మంచి అద్దె ఇస్తానని వాళ్లనడం, నాన్నగారు సరేననడం జరిగింది. మూడేళ్లున్న తర్వాత పరిశ్రమ పూర్తయి వాళ్లున్న వర్కు సైటుకి వెళ్లిపోయారు. నాయక్ గెస్ట్‌హౌస్‌కి వాచ్‌మన్‌గా ఉండేవాడు. ఫ్యాక్టరీవాళ్లు ఇల్లు ఖాళీ చేసి పోతూ, వాళ్లు ఫిక్స్ చేసిన ఎ.సి., గీజరు, మిర్రర్స్ గట్రా విప్పుకుపోయారు. కానీ తాళాలు మరచిపోయారు. అవి నవతాళ్, గాద్రెజ్ కంపెనీవి. ఇత్తడితో చేసినవి. మెరుస్తూ మమ్మల్ని ప్రలోభపరిచాయి. అవి వాళ్లకు తిరిగి ఇవ్వకుండా మేమే వాడుకున్నాం ఇన్నాళ్లూ. అయితే మా దగ్గర ఉండేవి సింగిల్ కీ మాత్రమే. రెండవ సెట్ ఫ్యాక్టరీవాళ్ల దగ్గర ఉండేవి. నాయక్ అవి అందించుకుని వాయిదాల పద్ధతిలో మా ఇంట్లో దొంగతనం చెయ్యడం మొదలెట్టాడు. మేం చేసిన ఒకే ఒక్క పొరపాటుకి ఆ విధంగా భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చింది

○


## 'పత్రిక' చందా వివరాలు

**కొం**దరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

పత్రిక విడిప్రతి : *5/-*
ప్రత్యేక సంచిక (ఉగాది, దీపావళి): *10/-*
సాలుసరి చందా : *60/-*

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**
79బి, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్,
హైదరాబాద్-33.